ఆంధ్రజ్యోతి
5
మంచిర్యాల
జిల్లా వార్తలు
బుధవారం 30 అక్టోబరు 2024





కేజీబీవీల్లో సమస్యలెన్నో..



భీమిని మండల కేజీబీవీలో చెడిపోయిన సోలార్ హీటర్ పరికరాలు

- అరకొర వేతనాలతో టీచర్లు, సిబ్బంది సతమతం
- విద్యాలయాల్లో వేధిస్తున్న ఉద్యోగుల కొరత
- కేర్‌టేకర్లు, వాచ్ ఉమన్‌లు లేక భద్రత కరువు

మంచిర్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు) సమస్యలతో సతమతమవుతున్నాయి. అరకొర సౌకర్యాలతో అటు సిబ్బందికి, విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉద్యోగులు, ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర వేతనాలతో సిబ్బంది వెట్టి చాకిరీకి గురవుతున్నారు. పనికి తగ్గ వేతనం వీరికి అందడం లేదు. మరోవైపు హాస్టళ్లకు కేర్‌టేకర్ల, నైట్ వాచ్ ఉమన్లు లేక తమకు రక్షణ కరువుతోందనే ఆందోళన విద్యార్థినుల్లో వ్యక్తమవుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత...

జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో కొన్నింటిలో సరిపడా కేర్‌టేకర్లు, నైట్ వాచ్ ఉమన్లు లేక విద్యార్థినులకు భద్రత లేకుండా పోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మంచిర్యాల జిల్లాలో 18 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. మొత్తం 4499 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. వాటిలో ప్రస్తుతం 405 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బోధన సిబ్బంది (టీచర్లు) 200 మంది, బోధనేతర సిబ్బంది 205 మంది పని చేస్తున్నారు. ఆయా విద్యాలయాల్లో సిబ్బంది కొరత ఇంకా ఉంది. 10 మంది వరకు టీచర్లు, అంతకు రెట్టింపు సంఖ్యలో ఇతర ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

(మిగతా 7వ పేజీలో..)

సమస్యలతో సతమతం..

కేజీబీవీల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు సమస్యలను ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు. స్పెషల్ అధికారి, సీఆర్టీ సహా కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది అంతా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్‌ఓలకు జీతం రూ.33 వేలు కాగా సీఆర్టీలకు రూ.26 వేలు అందుతోంది. సీఆర్పీలకు రూ.19,500, అకౌంటెంట్లకు రూ.14,300, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.7,800 ఇస్తున్నారు. ఏఎన్‌ఎంలు, నైట్ వాచ్ వుమన్లు, డే వాచ్ వుమన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు.. ఇలా అందరికీ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది...



ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



పూజలు చేస్తున్న ఆదిలాబాద్ ఎంపి గెడెం నగేష్

దండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గెడెం నగేష్ సూచించారు. గుడిరేవులో పద్మల్‌పూరీ కాకో ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. గిరిజన సంప్రదాబద్ధంగా గుస్సాడీతో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. కాకో అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆది వాసి సంప్రదాయాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అనంతరం ఎంపీ నగేష్‌ను ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుడిమేత సోము పటేల్, మాజీ సర్పంచు చిట్ల మంజు భార్గవి శ్రీనివాస్, ఆలయ కమిటీ నిర్వాహకులు పెంద్రం శ్రీనివాస్, నరేందర్, సంతోష్, జలపతి, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తామరపూల చెరువు

బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువు తామర పూలతో కనువిందు చేస్తుంది. చెరువంతా తామరపూల వనంలా కనిపిస్తోంది. రోడ్డు వెంట వెళ్లే చూపరులను పూలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి)



గొర్రెల మందపై చిరుతపులి దాడి

హాజీపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో మంగళవారం గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసింది. బుగ్గ గట్టులో గొర్రెలను మేపేందుకు కాపరులు తీసుకెళ్ళారు. ఒక్కసారిగా గొర్రెల మందపై పులి దాడి చేసింది. గొర్రెల అరుపులు విన్న కాపరులు చిరుత పులిని చూసి భయంతో పరుగులు తీశారు. పులి దాడిలో రెండు గొర్రెలు మృతి చెందగా, మరో గొర్రెను ఎత్తుకు పోయిందని కాపరులు తెలిపారు. కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు హాజీపూర్ డిప్యూటీ రేంజర్ సునీత సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పాద ముద్రలను పరిశీలించగా చిరుతపులిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. చిరుత పులి సంచారం నేపథ్యంలో ప్రజలు, గొర్రెల కాపరులు, రైతులు ఒంటరిగా గ్రామ, అటవీ శివారు ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచించారు.



మార్కెట్లో దీపావళి సందడి
6లో

ఆర్డీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీవో

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఆర్డీవోగా శ్రీనివాస్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంరతం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆర్డీవోను కలిసిన టీఎన్‌జీవో నేతలు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన జి.శ్రీనివాస్‌రావును మంగళవారం టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అధ్యక్షుడు నాగుల గోపాల్, సభ్యులు ఉన్నారు.

కనక రాజు మృతి తీరని లోటు

దండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు మృతి గిరిజన లోకానికి తీరని లోటని గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. కాకో ఆలయం వద్ద మంగళవారం కనక రాజు మృతి పట్ల నివాళులర్పించారు. ఆయన మృతి గిరిజనులకు తీరని లోటన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బం దీగా చేపట్టాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరా లను సేకరిస్తామన్నారు. జిల్లాలో ఎన్యుమరేటర్లను, సూపర్‌వైజర్‌లను నియ మించి శిక్షణ ఇస్తామన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్‌లను కేటాయించి ఒక బ్లాక్ కింద 150 కుటుంబాలు కేటాయించి వివరాలు నమదు చేయా లన్నారు. కేటాయించిన బ్లాక్‌లో అన్ని కుటుంబాలను ఖచ్చితంగా నమో దు చేయాలని, సర్వే సమయంలో ప్రతీ ఒక్కరి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ధరణి పాస్ పుస్తకం అందుబాటులో ఉంచుకునేలా తెలియజేయాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్ పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియలో వివరాలు సేకరించాలి

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమంలో నియమించిన ఎన్యూమరేటర్లు తమకు కేటయించిన కుటుంబాలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వం అందించిన నిర్ణీత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా గణాంక అధికారి సత్యం, ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీంలతో కలిసి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లా డుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాల న్నారు. జిల్లాలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్‌లను నియమించి శిక్షణ ఇస్తామని, ఎన్యుమరేటర్లకు కేటాయించిన బ్లాక్‌ల ప్రకారం వివరాలు సేకరించాలన్నారు. సూపర్ వైజర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించాల న్నారు. సర్వేలో పాల్గొన్న వారికి ప్రభుత్వం నుంచి తగిన గౌరవ వేతనం అందిస్తుందన్నారు. అధికారులు పాల్గొన్నారు.













బీసీ నాయకుల మౌన దీక్ష



మౌన దీక్ష చేస్తున్న బీసీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బీపీ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గాంధీ పార్కులో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మౌన దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ అప్పటి జనతా ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయడానికి 1978లో బీపీ మండల్ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. కమిషన్ దేశ వ్యాప్తంగా పర్యటించి 1980లో 40 అంశాలతో కూడిన నివేదికను అందజేసిందన్నారు. నివేదిక ఇచ్చి 40 సంవత్సరాలు దాటుతున్నా ఏ ఒక్క సిఫార్సులను అమలు చేయలేదన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీపీ మండల్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు చుంచు రాజ్‌కిరణ్, కర్రె లచ్చన్న, భీంసేన్, రమేష్, వేణుగోపాల్, సతీష్,రమేష్, బిక్షపతి, రాజేశం, రాజన్న,చారి, సతీష్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

యువత క్రీడల్లో రాణించాలి

పెంచికలపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని గుంట్లపేట గ్రా మంలో మంగళవారం యువకుల ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ యువత వ్యసనాలకు దూ రంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో శారీరక ధ్రుడత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. అనంతరం క్రీడాకారు లకు వాలీబాల్ కిట్‌ను అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, మహేష్, బి.మహేష్, ప్రభా కర్, భాస్కర్, భీమయ్య, చిన్నయ్య, దేవాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జీసీడీవో శకుంతల అన్నారు. కుంటలమానేపల్లి, బెజ్జూరు బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలను మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యార్థికి పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతీ గృహాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కోరారు. అనంతరం పాఠ శాలలోని వంట గదులు, పరిసరాలు పరిశీలించారు. ఆమె వెంట ప్రధా నోపా ధ్యాయులు పరశురాం, దినకర్ ఉన్నారు.

డీఎస్పీని కలిసిన నాయకులు

కాగజ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): కాగజ్‌నగర్ డీఎస్పీ రామాను జంను కాంగ్రెస్ నాయకులు మంగళవా రం కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ఫైసల్ బీన్ సులేమాన్ మాట్లాడుతూ పలు సమస్యలపై ఆయన తో చర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

పెంచికలపేట, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): పెంచికలపేట మండలం బొం బాయ గూడ గ్రామంలో బడి మానేసిన రౌతు సిద్దు అనే బాలుడిని వారం రోజుల క్రితం సామాజిక కార్యకర్త ప్రకాష్ పాఠశాలలో చేర్పించారు. బాల ుడి పరిస్థితి గురించి తెలుసుకున్న ఎస్సై కొమురయ్య పాఠశాలను సంద ర్శించి విద్యార్థికి స్కూల్‌బ్యాగ్‌తో పాటు ఏడాదికి సరిపడా బుక్స్ పెన్నులు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయురాలు అహల్య, గ్రామ పెద్దలు గుండయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడికి చేయూత

దహెగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలానికి చెందిన శైలజ, శ్యాం దంపతుల కుమారుడు సాంబర్లో పడి మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందగా లిటిల్ స్మైల్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో దాతల సహాయంతో సేకరించి రూ.1.50 లక్షలను ఆసుపత్రిల అందజే శారు. కార్యక్రమంలో సునీల్, రాందేవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన బొట్టుపల్లి సాయి దీక్షా ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో మంగళవారం పలువురు అభినందించారు. కార్యక్ర మం లో ప్రిన్సిపాల్ మహేశ్వర్, పీడీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



అప్రమత్తతోనే ఆనంద దీపావళి

- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు మరువొద్దు
- అధికారుల సూచనలు పాటిస్తే మేలు

మంచిర్యాల అర్బన్/బెజ్జూరు, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): దీపావళి పండుగ రోజున అందరి ఇళ్ల దీపా లతో, టపాసుల మోతతో సంబరాలు మిన్నంటుతాయి. ఈ సంబరాల్లో అపశ్రుతులు జరుగకుండా జాగ్రత్తలు తీ సుకుంటే దీపావళి పండుగ ఆనందోత్సాహాల మధ్య హాయిగా గడిచిపోతుంది. ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు చాలా జాగ్ర త్తగా ఉండాలి. దీపావళి పండుగను సంతోషకరంగా ప్రమాదాల రహితంగా జరుపుకునేందుకు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు..

- సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 8 నుంచి 10 గంటలలోపు టపాసులు కాల్చుకోవాలి.
- టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు వేసుకోవాలి.
- పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చాలి.
- టపాసులను ఇంటి బయట, బహిరంగ ప్రదేశంలోనే కాల్చాలి.
- పూర్తిగా పేలని బాంబులపై నీరు లేదా ఇసుకను చల్లి నిప్పును చల్లార్చాలి.
- మండుతున్న క్రాకర్స్‌ను ఎప్పుడు శరీరానికి, బట్టలకు దూరంగా ఉండేట్లు చూసుకోవాలి.
- రాకెట్స్, ఫైర్ క్రాకర్స్‌ను గుడిసెలు, పెట్రోల్‌బంక్‌లకు దూరంగా కాల్చాలి.
- టపాసులపైకి వంగి నిప్పు అంటించొద్దు.
- దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరుగెత్తవద్దు. నేలపై దొర్లాలి. దుప్పటి చుట్టుకోవాలి.
- టపాసులను అగ్గిపుల్లలకు, దీపాలకు, గ్యాస్‌సిలండ ర్లకు దూరంగా ఉంచాలి.
- టపాసులు కాల్చే స్థలంలో రెండు బకెట్ల నీటిని ఉంచుకోవాలి.
- రాకెట్లను ఆకాశంలోకి వెళ్లేలా కాల్చాలి. పక్కకు పెట్టి కాల్చితే ఇళ్లలోకి దూసుకెళ్లి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశ ఉంది.
- టపాసులను చేతిలో పట్టుకుని నిప్పు అంటించొద్దు

నిబంధనలు పాటించాలి..



దీపావళి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల నిర్వాహ కులు ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలి. టపాసులు పేల్చేటప్పుడు ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలకు దూరంగా ఉంచాలి. కాటన్ దుస్తులు ధరించాలి. మండే స్వభావం ఉండే వస్తువుల వద్ద టపాసులను కాల్చకూడదు..

\- జిల్లా అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్‌రెడ్డి

మార్కెట్‌లో దీపావళి సందడి



మట్టి ప్రమిదలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నస్పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మార్కెట్‌లలో దీపావళి సందడి నెలకొంది. ప్రమిదలు, వివిధ రకాల పూలు, బంతి పూలు, పూజ సామగ్రి కొత్త వస్తువుల కొనుగోళ్లలో ప్రజలు నిమగ్నమయ్యారు. మార్కెట్లోకి వివిధ రకాల డిజైన్లలో మట్టి ప్రమిదలు లభ్యమవుతున్నాయి. ఇంటి ముందర వివిధ రకాల పూల తో అలంకరణలు, మామిడి ఆకుల తోరణాలు, పూలదం డాల అలంకరణ చేయడానికి ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

● విద్యుత్ దీపాలతో అలంకరణ...

దీపావళి సందర్భంగా విద్యుత్ వెలుగులతో గృహాలు శోభయమానంగా కనిపిస్తాయి. కొత్త కొత్త ఎల్‌ఈడి లైట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒక వైపున ప్రమిదల వెలుగులు, మరో వైపున విద్యుత్ దీపాల కాంతుల అలంకరణలు కొత్త శోభను తెచ్చి పెడుతుంది. ఇళ్ళు వ్యాపార సముదాయాల వద్ద పాల చెట్టు కొమ్మలు, అరటి చెట్లు, కొబ్బరి ఆకులు, పూలదండలతో అందంగా అలంకరణ చేస్తారు.

● ధరలు పైపైకి...

కిలో బంతి పూలు రూ. 100, అరటి పండ్లు డజను రూ. 60నుంచి 80 వరకు, ప్రమిదలు చిన్నవి, పెద్దవి డజను రూ. 40 నుంచి 50 వరకు, బూడిద గుమ్మడి కాయ సైజు బట్టి రూ. 100 నుంచి 200 వరకు, గుమ్మడి కాయ రూ. 200లకు లభిస్తున్నాయి.

● టపాసుల ధరలు పైపైకి...

గతేడాదితో పోలిస్తే టపాసుల ధరలు ఆకాశనంటు తున్నాయి. తారాజువ్వల్లా ధరలు పైపైకి దూసుకు పో తుంటే కొనుగోలుదారులు వెనుకంజవేస్తున్నారు. చిచ్చు బుడ్లు, లక్ష్మీబాంబులు, ఉల్లిగడ్డ బాంబులు, భూ చక్రాలు, విష్ణు చక్రాలు, తదితర బాణా సంచా ధరలు 10 నుంచి 15 శాతం వరకు పెరిగాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బాణా సంచా వ్యాపారం సుమారు రెండున్నర కోట్లకు పైగా జరుగుతుందని అంచనా.

31న దీపావళి పూజలు



దీపావళి పర్వదినం గురువారం రోజున ఉంది. గురు వారం ఉదయం 5 నుంచి 7 గంటల వరకు హారతులు, సాయంత్రం 4గంటల నుంచి 10-45 గంటల వరకు దీపావళి ధనలక్ష్మి పూజలు, నోములు నిర్వహించు కోవ చ్చు. నవంబరు 1న కేదారేశ్వర వ్రతం శుక్రవారం స్వాతి నక్షత్రం ఉన్నందున సాయంత్రం 5 నుంచి రాత్రి 10-40 గంటల వరకు కేదారేశ్వర వ్రతం, కొత్త నోములు, పడి పోయిన నోములు నిర్వహించుకోవచ్చు. 2న కేదారేశ్వర వ్రత ఉద్వాసన ఉదయం 7-40 నుంచి ఉదయం 9.10 గంటల లోపు చేసుకోవచ్చు.

\- వంశీకృష్ణ శర్మ, పూజారి నస్పూర్



రంగు రంగుల ఎల్ఈడీ లైట్లు



టపాసుల దుకాణంలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



మట్టి ప్రమిదలు, బూడిద గుమ్మడి కాయలు

తెగని పంచాయితీ ..ఎస్పీఎం కార్మికుల ర్యాలీ



సబ్ కలెక్టర్‌కు సమస్య తెలియజేసేందుకు వచ్చిన ఎస్పీఎం కార్మికులు

కాగజ్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎస్పీఎం మిల్లు సమస్య కొలిక్కి రాక రావడం లేదు. ఎస్పీఎం మిల్లును నడు పుతున్న జేకే యాజ మాన్యం, కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ మ ధ్య తలెత్తిన వివాదం సమసి పోవడంతో లే దు. ఇన్నాళ్ల లారీ అసో సియేషన్ సభ్యులు ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం ఎస్పీఎం కార్మికులు, స్టాఫ్ ఉద్యోగులు రోడ్డు బాట పట్టారు. భారీ ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు సమస్యను వివరించారు. మిల్లులో ఉత్పత్తి నిల్వలు పెరుగుతున్నాయని, ఈ సమస్యన పరిష్కరించాలని కోరారు.

గుండాలను సందర్శించిన ఏటీడీవో

తిర్యాణి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాల గ్రామాన్ని ఏటీడీవో చిరంజీవి సందర్శించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలను తనిఖీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలిం చారు. ప్రతీ రోజు పిల్లలు బడికి వచ్చేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు.

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

రెబ్బెన, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న మహిళ ఉద్యోగులకు మంగళ వారం గోలేటి గని సీఈఆర్ క్లబ్‌లో పదోన్నతులు, హోదా కలిగిన వారికి కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం రాజమల్లు సింగరే ణిలో ఉన్న పలు హోదా గల ఉద్యోగాలు, పదోన్నతులు కాలపరిమితిపై వివరించారు. కార్యక్రమంలో డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా, సీనియర్ మెడిల్ అధికారి డా క్టర ఎం.మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జైనూరు ఘటన నిందితుడిపై పీడీయాక్టు నమోదు

ఆసిఫాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జైనూరు ఆదివాసీ మహిళపై గత నెలలో జరిగిన హింసాత్మక దాడిలో నిందితుడైన మగ్దూంపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. నిందితు డికి కఠినమైన శిక్షలు విధించే విధంగా జిల్లా పోలీసు యంత్రాంగం విధులు నిర్వరిస్తున్నదని తెలిపారు. చర్లపల్లి జైలులో ఉన్న నిందితుడికి పీడీ యాక్టు కు అందజేశారు. పీడీ యాక్టులు నమోదు చేయడంతో నేరాలు తగ్గుముఖం పడుతాయని తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరు కూడా శిక్ష నుంచి తప్పించుకోలేరని, ప్రజలు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్పీ తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి జీవితఖైదు

\- మరొకరికి 10 ఏళ్ల జైలుశిక్ష

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నమోదైన ఇద్దరు నిందితులలో ఒకరికి జీవితఖైదు, రూ. 15వేల జరిమానా, మరొకరికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు నిచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్, కౌటాల సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరు మండలానికి చెందిన ఓ బాలికపై అదే ప్రాంతానికి చెందిన టార్రె ప్రకాష్, కావ్రె గణేష్ అనే వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తిం చి లైంగికంగా వేధించారు. జనవరి 22, 2018న బాలిక స్నేహితురాలు ఫిర్యాదు మేరకు బెజ్జూరు పోలీసు స్టేషన్‌లో టార్రె ప్రకాష్, కావ్రె గణేశ్‌లపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అప్పటి పోలీసు అధికారులు కేసు విచారణ చేపట్టి నిందితులను కోర్టులో హాజరు పరిచారు. 18 మంది సాక్ష్యులను విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడం తో టార్రె ప్రకాష్‌కు జీవితఖైదు, జరిమానా, కావ్రె గణేష్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ర్యాగింగ్, గొడవలకు పాల్పడితే కఠినచర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో ర్యాగింగ్, గొడవలకు పాల్పడితే శిక్షార్హులవుతారని ఏసీపీ ఆర్.ప్రకాష్ అన్నారు. మం గళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ ర్యాగింగ్, గొడవలకు పాల్పడటం నేరమన్నారు. కొందరు విద్యార్థులు ర్యాగింగ్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గంజాయి, గుట్కా, సిగరేట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లన్నారు. అనవసర విషయాలను పక్కన పెట్టి చదువుపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదువుకొని ఉత్త మ డాక్టర్లుగా ఎదగాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే 100కు డయల్ చేయా లన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సులేమాన్, పట్టణ సీఐ ప్రమోద్ రావు, ఎస్సై లు సనత్, ప్రవీణ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు గుండా మల్లేష్ పేరు పెట్టాలి

బెల్లంపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కు మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ పేరు పెట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయం బాశెట్టి గంగారాం విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన విలే కరుల సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ భవనానికి గడ్డం వెంకట స్వామి పేరు పెట్టడం సరైంది కాదన్నారు. స్థానికుడు, నాలుగు సార్లు ఎమ్మె ల్యేగా పనిచేసిన కామ్రేడ్ గుండా మల్లేష్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి మాట్లాడుతూ గుండా మల్లేష్ పేరు పెట్టాలని కలెక్టర్‌కు, ఎమ్మెల్యే, ఆర్డీవో, మున్సిపల్ కమిషన ర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. పూర్ణిమ, బాపు, లక్ష్మీనారా యణ, రాజేష్, చంద్రమాణిక్యం, శ్రీను పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరు పెట్టాలి...

కూరగాయల మార్కెట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసు లేటి వెంకటేష్, ఎన్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్‌లు పేర్కొ న్నారు. మంగళవారం ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అం దించారు. వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమా వేశంలో గడ్డం వెంకటస్వామి పేరు పెట్టాలని తీర్మానం చేయడం బాధా కరమ న్నారు. ఆరేపల్లి రమేష్, ఆరేపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంట ధ్వంసం చేసిన అడవి పందులు

నెన్నెల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగారం గ్రామానికి చెందిన రైతు తలండి సురేష్‌కు చెందిన వరి పంటను సోమవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. మరో వారం పది రోజుల్లో చేతి కొచ్చే ఎకరం విస్తీర్ణంలో పంటను పందులు దెబ్బతీశాయని బాధిత రైతు పేర్కొన్నాడు. రూ. 50 వేలు నష్టం జరిగిందని, పరిహారం అందజేసి ఆదుకోవాలని అటవీశాఖ అధి కారులను వేడుకుంటున్నారు. పక్కనే ఉన్న గుడికందుల రగుణయ్య రైతు చేనులో అడవి పందులు పత్తి పంటను ధ్వంసం చేశాయి. చెట్లను విరిచేసి, కాయలను కొరికాయని రైతు చెప్పాడు.

మట్టి నమూనాల సేకరణ

హాజీపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవ సాయ విశ్వవిద్యాలయం భూసార విభాగం శాస్త్రవేత్త రాజమణి మంగళ వారం హాజీపూర్‌లో మట్టి నమూనాలను సేకరించారు. ఆమె మాట్లాడు తూ మట్టి నమూనాల విశ్లేషణ ద్వారా సూక్ష్మ, స్థూల పోషకాల నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. మట్టినమూనాలను పరిశీలించి పంటలకు ఎంత ఎరువులు వినియోగించాలో తెలియజేస్తామన్నారు. భూమి నీటి కాలుష్యం జరుగుతున్నందున మట్టి నమూనాలు సేకరించి పోషకాల లభ్యత ఆధా రంగా ఎరువుల మోతాదును తెలియజేస్తామన్నారు. వ్యవ సాయాధికారి కృష్ణ, ఏఈవోలు కొమురయ్య,మౌనిక, ప్రసన్న, పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

నస్పూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పితామహుడు ధన్వం తరి జయంతిని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి పలువురికి పరీక్షలు చేశారు. ఆయుర్వేద జిల్లా ఇన్‌చార్జీ డాక్టర్ పద్మజా, ఫార్మసిస్టు పుష్పాంజలి, ఎస్‌సీఎస్ కిషన్, పీహెచ్‌సీ వైద్యురాలు సమత, ఐసీడీఎస్ కో ఆర్డినేటర్ రజిత, అంగన్‌వాడీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా నాయీబ్రాహ్మణ సంఘ భవనంలో ధన్వంతరి జయంతి నిర్వహించారు. చంద్రయ్య, వెంక టేశం, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

దండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నంబాల గ్రామ పంచాయతీ పరిధిలోని రాసపల్లి గ్రామానికి చెందిన చిందం మల్లేశ్వరి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆమెను మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా గుడిపేట వద్ద పురిటి నొప్పులు ఎక్కువై కాన్పు చేయగా పాప జన్మించింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ చుంచు తిరుపతి, పైలట్ సత్యంలు తెలిపారు.

పత్తి పంటల పరిశీలన

భీమారం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆరేపల్లి గ్రామంలోని పత్తి పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి సుధాకర్ పరిశీలిం చారు. పత్తిలో కాత పూత దశ కీలకమని ఈ దశలో సరైన జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. గులాబీ రంగు పురుగు, పొగాకు లద్దె పురుగు ఉధృతి నివారణకు నోవాల్యూరన్ 250 మిల్లీలీటర్లు లేదా ఏమోమోక్టిన్ బెంజోయెట్ 250 గ్రా ములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.



జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 42 సంవత్సరాలు వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తించి శ్రీరాంపూర్ జీఎంగా పదవీ విర మణ పొందుతున్న జీఎం సంజీవరెడ్డిని ఎస్టీపీపీ అధికారులు మంగ ళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు జీఎం సంజీవ రెడ్డితో కలిసి పనిచేసిన అనుభవనాలను గుర్తు చేశారు. సంజీవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికా రులు ప్రసాద్, మదన్‌మోహన్, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఈ నెల చివరలో రిటైర్ కానున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డిని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూని యన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో జరిగిన కార్యక్రమంలో పిట్ కార్యదర్శి సీపతి బానేష్, కోన ఓదెలు, జగన్‌మోహన్ రెడ్డి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్ సేవలు ఆదర్శం

మందమర్రిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): మందమర్రి ఏరియా పర్యావరణ అధికారిగా పనిచేసిన ప్రభాకర్ సేవలు ఆదర్శప్రాయమని జీఎం దేవేందర్ అన్నారు. స్థానిక ఎల్లందు క్లబ్‌లో మంగళవారం ప్ర భాకర్ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్ర మంలో రఘుపతి, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బ్రహ్మానందం

శ్రీరాంపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలని, కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనపై సీబీఐతో వి చారణ జరిపించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీ డబ్ల్యూయూ-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో మహిళలు నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడారు. దేశంలో మహిళలపై జరు గుతున్న అఘాయిత్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలువరిం చలేకపోతున్నాయని ఆరోపించారు. పనిస్థలాల్లో మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి భద్రతకు చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళల రక్షణకు చర్యలు చేపడుతూ, గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేప ట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కార్మికులు అప్పారావు, శంకర్, సుధాకర్, వెంకన్న, సమ్మయ్య, రాజేశ్ సురేష్, ఎల్లయ్య, శారద, కవిత, విజయ, సుప్రియ, సత్తెక్క, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: అభయ కేసును నిర్వీర్యం చేస్తున్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ దిష్టి బొమ్మను మంగళవారం రెబ్బెన మండల గోలేటి సివిక్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి శీల మహిళ సంఘం నాయకురాలు పెంటపర్తి లక్ష్మి కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కవిత, తార, నాగలక్ష్మి, రాణి, ఈశ్వరి, మోతుబాయి, శంకరమ్మ, సునిత, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): సింగరేణి కార్మికుల సొంతింటి కలను యాజమాన్యం నెరవేర్చాలని హెచ్ ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మా ట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన కార్మి కుడు క్వార్టర్‌ను ఖాళీ చేస్తేనే గ్రాడ్యూటీ డబ్బు లు చెల్లిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమ వుతూ విరమణ నాటికి ఇల్లు క ట్టుకోలేకపో తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



బాబుకు కండువా వేస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏఐటీ యూసీకి చెందిన మైనింగ్ స్టాఫ్ నాయకు డు మంగళవారం ఐఎన్ టీయూసీలో చేరారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ ఆయనకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వా నించారు. కార్మికుల స మస్యల పరిష్కారానికి త మ యూనియన్ పనిచే స్తోందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, నాయకులు గరిగే స్వామి, తిరుపతి రాజు, భీమ్ రవి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆయుష్మాన్ భవ ప్రారంభం
-ఆన్‌లైన్‌లో వీక్షించిన ఆరోగ్య సిబ్బంది



వెంచపల్లిలోని సబ్ సెంటర్‌లో వీక్షిస్తున్న ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు

కోటపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 70 ఏండ్లు దాటిన వృద్ధులకు ఆరోగ్య భరోసా అందించేందుకు కేంద్రం ఆయుష్మాన్ భవ పథకాన్ని మంగళవారం ప్రారంభించింది. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ప్రధాన మంత్రి మోదీ దీన్ని లాంఛనంగా ప్రారంభించగా ఈ పథకం వల్ల వయోవృద్ధులకు లబ్ధి చేకూరనుంది. ప్రధాన మంత్రి ప్రారంభించిన ఈ పథకాన్ని ఆన్‌లైన్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి అరుణశ్రీ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది వీక్షించారు.

క్యాతన్‌పల్లి రైల్వే గేట్ మూసివేత

రామకృష్ణాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే గేట్ వారం పాటు మూసివేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు మూసివేస్తామన్నారు. నిర్మాణ పనుల కోసం గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు రైల్వే శాఖ అధికారులకు సహకరించాలని తెలిపారు.

విద్యుత్ తీగలు తొలగించాలి

తాండూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బోయపల్లి గ్రామంలో ఇండ్లపై ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించాలని మంగళవారం గ్రామస్థులు ఏఈకి వినతిపత్రం అందించారు. ఇంటిపై ఉన్న విద్యుత్ లైన్‌తో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే లైన్‌ను తొలగించాలని కోరారు. సింగిల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, పున్నంగౌడ్, నారాయణ, ప్రభాకర్, రమేష్, రాజం, మహేష్, కనకయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుకు సన్మానం

నెన్నెల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ సభ్యులు, ప్రోటోకాల్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావును హైదరాబాదులో మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. రాజన్నయాదవ్, సతీష్, గోమాస తిరుపతి ఉన్నారు.



దండారీ దర్బార్‌కు వస్తున్న ఆదివాసీలు



నృత్యం చేస్తున్న మహిళలు

గిరిజన గూడాల్లో దండారీ సంబరాలు

కాసిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :ఆదివాసీల జీవన విధానంలో అంతర్భాగ మైన దండారీ ఉత్సవాలు ఆకడి (జూలై మాసం)పూజలతో మొదలై దీపావళి అశ్వయుజ పౌర్ణమితో ముగుస్తాయి. నాలుగు నెలల పాటు గిరిజన గూడాలన్నీ దండారీ నృత్యాలు, ప్రత్యేక వాయిద్యాలతో మార్మోగి పోతాయి. నెమలి ఈకలతో తయారు చేసి న టోపి ధరించిన గుస్సాడీలను ఆది వాసీలు శివుడి ప్రత్యక్ష రూపమని కొలు స్తారు. గుస్సాడీ వేషధారణ ఉన్న వారు నియమ నిష్టలను పాటిస్తారు. సంప్ర దాయ వాయిద్యాలు, గుమ్మెల పర్ర కోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దండారీ ఉత్సవాల్లో మహిళలు చేసే నృత్యాలు ఆకట్టుకుంటాయి. దండారీలకు ఆతిథ్యం ఇస్తే అష్ట ఐశ్వర్యాలతోపాటు ఆయురా రోగ్యాలు లభిస్తాయని గ్రామ పటేళ్లు ఇం టికి ఆహ్వానించి అతిథి మర్యాదలు చేస్తారు. ఇలా నాలుగు నెలల పాటు దండారీ ఉత్సవాలు గిరిజన గూడాల్లో వైభవంగా కొనసాగుతాయి.

● **శివునికి ప్రతిరూపమే గుస్సాడీలు**

ఆదివాసీలు పవిత్రంగా నిర్వహించు కునే వేడుక దండారీ ఉత్సవాలు. దండారీ లో గుస్సాడీల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆదివాసీలు నెమలిని పవిత్రంగా పూజిస్తారు. అందుకే నెమలి ఈకలతో తయారు చేసిన టోపీలను తలపై ధరించి, టోపికి పొట్టేలు కొమ్ములు, ఎదుటివారి ముఖం ప్రతిబింబించే విధంగా అద్దం అమర్చుతారు. అద్దంవల్ల దుష్ట శక్తులు గుస్సాడీలను ఆశించకుండా ఉంటాయనేది నమ్మకం. నెమలి ఈకల టోపీల్లో సూర్యచంద్రుల ఆకారాలతో ఈకలు అమరుస్తారు. సూర్యచంద్రులను వీరు దేవతలుగా పూజిస్తారు. ఒళ్లంతా బూడిద రాసుకుని మేక చర్మంపై కూర్చు ని పూజలు చేస్తారు. వీటితో పాటు చంక లో జోలె కూడా ఉంటుంది. శివుని బిక్ష మెత్తుకునే జంగమయ్య వేషధారణలో కోరిన వరాలు ఇస్తాడనేది వీరి విశ్వాసం. గుస్సాడీలు గ్రామ పటేల్‌ల ఇండ్లకు వెళ్లిన ప్పుడు జోలెలోని ధాన్యం గింజలు ఇచ్చి ఆశీర్వదిస్తారు. దీంతో ఆతిధ్యం ఇచ్చిన వారికి దేనికి కొదువ ఉండదనేది వీరి విశ్వాసం. గుస్సాడీల చేతుల్లో ఉండే దుడ్డుకర్ర (రోకలి) దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం వాడే ఆయుధంలా చూపుతారు. కాళ్ల గజ్జెలతో గుస్సాడీలు చేసే శివ తాండవం దండారీ ఉత్సవాల్లో చివరి అంకం. గుస్సాడీల ఆటాపాటలతో అందర్ని భక్తి పారవశ్యంలోకి తీసుకువెళ్తారు. తొలి ఏకా దశి ఆకడితో ప్రారంభమైన దండారీ ఉత్స వాలు దీపావళి కోలబోడి అనే కార్యక్రమంతో ముగిస్తారు. దండారీల ఉత్సవా లతో పాడి పంటలు, అయురారోగ్యాలతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకంతో యేటా నిర్వహిస్తారు.

కాకో ఆలయంలో గిరిజనుల రద్దీ

దండేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : గుడిరేవు పద్మల్‌పూరీకాకో ఆలయంలో గిరిజనులు ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వారం గిరిజనులు కుటుంబ సమేతంగా ఉమ్మడి జిల్లాతో పాటు, పలు వివిధ ప్రాంతల నుంచి తర లివచ్చారు. గుస్సాడి వేషధారణలతో డప్పుచప్పులతో గోదావరి స్నానం ఆచరించి కాకో అమ్మని దర్శిం చుకుని పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పిండి పదార్థాలు వండి నైవేద్యం సమర్పించారు. మహిళలు రేలా రేలా ఆటాపాటలతో నృత్యాలు చేస్తూ, గిరిజనులు గుస్సాడి వేషాదారణలతో కోలాటాలతో సందడి చేశారు.



కాకో ఆలయం వద్ద గుస్సాడి నృత్యాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న మహిళలు



కాకో ఆలయం వద్ద దండారీ గుస్సాడి నృతాలు చేస్తున్న గిరిజనులు

గుస్సాడి నృత్యాలను వీక్షించి.. సెల్‌ఫోన్‌లో బంధిస్తూ

దండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుడిరేవులోని పద్మల్‌పూరీ కాకో ఆలయంలో 12రోజుల నుంచి జరుగుతున్న దండారీ గుస్సాడీ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివాసి గిరిజనులు కుటుంబ సమేతంగా తరలివచ్చి కాకో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కాకో ఆలయం వద్ద నిర్వహిస్తున్న గుస్సాడి వేషధారణలతో నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం గుస్సాడి నృత్యాలను వీక్షిస్తూ గిరిజనులు తమ సెల్‌ఫోన్‌లో బంధించి జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకున్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఆదివాసీలు



గుడిరేవులో పద్మల్‌పూరీ కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న గిరిజనులు

కేజీబీవీల్లో సమస్యలెన్నో...!

5వ పేజీ తరువాయి

విద్యార్థినులకూ తప్పని ఇబ్బందులు...

ఒక్కో కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సుమారు 250 నుంచి 350 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో వేడినీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం పనిచేయడం లేదు. భీమిని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలలో సోలార్ వాటర్ హీటర్ చెడిపోయి చన్నీటి స్నానాలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా విద్యాలయాల్లో మరుగుదొడ్లు సరిపోకపోవడంతో సమయం వృథా అవుతోందని వారు అంటున్నారు. పైగా పలుచోట్లా డోర్లు పాడైపోవడం, మరుగుదొడ్ల ట్యాంకులు నిండి వాటిని సకాలంలో శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా న్యాప్‌కిన్స్ ఇవ్వడం లేదని, హెల్త్ కిట్‌కు బదులు రూ. 100 చెల్లిస్తున్నారని తెలిపారు. అవి కూడా ఎప్పుడు మంజూరవుతాయో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్‌లు ఇవీ.....

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి, కనీస వేతనం స్కేలు అమలు చేయాలని డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ. 10 లక్షలు, ఆరోగ్యబీమా రూ.5 లక్షలు వర్తింపజే యాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. పదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని పర్మనెంటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐటీఐ పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యను పూర్తి చేసుకొని ఉత్తీర్ణులుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రమేష్ సర్టిఫికెట్లను అందజేయడంతోపాటు 9 ట్రేడ్లలో 90 శాతం ఉత్తీర్ణత సాధించడంపై సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఐటీఐ చేయడం వల్ల ఉపాధి అవకాశాలతోపాటు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వాసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీధర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.జనార్దన్, ఐటీఐ స్టాఫ్ మెంబర్స్ డీటీఓలు హఫీజ్, వెంకటేశ్వర్లు, ఏటీఓలు సోహెబ్, రాజేందర్, శశికుమార్, తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన



బెల్లంపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో మంగళవారం సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు రకాల సంప్రదాయ దుస్తులు ధరించి అలంరించారు. డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ రాజారమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయ సహాయంపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి అర్పిత

మందమర్రిరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌పల్లి రైతువేదికలో మంగళవారం రైతులకు సాగు చట్టాలు, న్యాయ సహాయంపై జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ అర్పితమారంరెడ్డి అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ రైతులు ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొన్నప్పుడు రశీదులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు ఇస్తే డీలర్‌పై కేసు వేసి న్యాయం పొందవచ్చని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఆర్‌వోఆర్ చట్టం సవరణలు, విత్తన చట్టం, భూ సంస్కరణల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రకాష్, మండల వ్యవసాయాధికారిణి కిరణ్మయి, న్యాయ సేవ కౌన్సిల్ అధికారి ఎండీ సందాని, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవో రజియాసుల్తానా, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య, మాజీ సర్పంచులు , రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళోత్సవం పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాసిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కళోత్సవం పోటీలకు ముత్యంపల్లి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు గైడ్ టీచర్ బండ శాంకరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 16,17 తేదీల్లో జిల్లా సైన్స్ కేంద్రంలో జరిగిన డ్రామా, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ అంశాల్లో నవనందుల బిందు ప్రియ, గాజుల నరేందర్‌లు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. నాటిక ప్రదర్శనలో రమ, లక్ష్మణ్, విశ్వసూర్య, ఎస్‌కే అన్వర్, శివకుమార్‌లు ప్రతిభ కనబర్చారని తెలిపారు. అలాగే వ్యర్థం నుంచి అర్థం అనే అంశంపై నిర్వహించిన క్రాఫ్ట్ మేళాలో బిందుప్రియ, విశ్వసూర్యలు ప్రథమ స్థానాలు సాధించి రూ.3 వేల నగదు బహుమతులు అందుకున్నారన్నారు. నవంబర్ 1, 2 తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

మందమర్రిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్‌కుమార్ మంగళవారం హైద్రాబాద్ లోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహులు చేతుల మీదుగా సంజయ్‌కుమార్ సభ్యత్వం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టాలని సూచించినట్లు సంజయ్‌కుమార్ తెలిపారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

వేమనపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాణసంచా దుకాణాలు ఇండ్లలో, జన సముదాయల మధ్య, గోదాముల్లో నిల్వ చేసి లైసెన్స్ లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. లైసెన్స్ ఉన్న వారు దీపావళి సామాగ్రి అమ్మేందుకు చూపిన ప్రదేశాల్లోనే విక్రయించరాలని, ఫైర్ సేఫ్టీ ఖచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలుంటాయని తెలిపారు.

సరుకులు అందజేత

దండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపేట గ్రామానికి చెందిన బూతగడ్డ భారతీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్ రూ. 3 వేల విలువ గల సరుకులను అందజేశారు. ఆడాయి కాంతరావు, లక్ష్మయ్య, రవీందర్, సత్యం, జాఫర్‌ఖాన్, అన్వేష్, లచ్చవ్వలు పాల్గొన్నారు.

ఫోన్‌లో ఉపాధిహామీ సమాచారం




జైపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన వారికి ఏడాదికి వంద రోజులు పని కల్పిస్తున్నారు. ఈ పథకంలో పారదర్శకతను తీసుకొచ్చి అక్రమాలకు తావు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రకాల సంస్కరణలను తీసుకొచ్చాయి. అందులో భాగంగా కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా సదరు లబ్ధిదారుడికే నేరుగా అందించడానికి బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలను తెరిచి వాటి ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే కొందరికి ఒకటి కంటే ఎక్కువగా ఖాతాలు ఉండడం ఆధార్‌కార్డు లింకేజీల ద్వారా డబ్బులు ఏ ఖాతాలో జమ చేశారో తెలుసుకునేందుకు సదరు కూలీలు ఇబ్బందులు పడేవారు. ఈ బాధలు లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జన్ మన్ నరేగా అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పథకంలో చేపట్టే పనుల వివరాలను తెలుసు కోవడంతో పాటు అందులో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఇది అన్ని భాషల్లో అందుబాటులో ఉంటుంది. మంచిర్యాల జిల్లాలో ఉపాధి హామీ కూలీలు 2,36,020 మంది ఉండగా జాబ్ కార్డులు 1,20,430 ఉన్నాయి.

ఎలా పనిచేస్తుంది...

ప్లేస్టోర్‌లో నుంచి జన్‌మన్ నరేగా అనే యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి. అందులో కూలీ వేతనాలు, పని దినాలకు సంబంధిం చిన వాటిని ఎంపిక చేయాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, ఫ్యామిలీ ఐడీ వివ రాలు నమోదు చేయాలి. పేమెంట్ ఆప్షన్ లోకి వెళ్లి వ్యక్తి పేరు మీద ఎంపిక చేస్తే ఎక్కడ పనిచేశారు. దానికి సంబంధించిన వర్క్ సంఖ్య తదితర వివరాలతో పాటు వేతనాలు ఎప్పుడు జమచేశారు, ఏ బ్యాంకులో వేశారు వంటి వివరాలు లభిస్తాయి. ఉపాధిహామీ

యాప్‌తో కూలీలకు సౌలభ్యం

వేతనాలు జమ కాకపోతే సదరు లబ్ధి దారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ లింకు అయ్యిందా, బ్యాంకు వివరాలు, ఏబీపీ ఎస్ లింక్ అయ్యిందా అనే వివరాలు ఉంటాయి. ఒకవేళ అన్ని లింకైతే పచ్చ రంగులో రైట్ గుర్తు ఉంటుంది. లేని పక్షంలో దేనికి కాలేదో అక్కడ ఎర్ర రంగులో తప్పు గుర్తు ఉంటుంది. దీన్ని బట్టి వేతనాల్లో ఇబ్బందులు లేకుండా నేరుగా లబ్ధిదారుడే చూసుకోవచ్చు. అలాగే జాబ్ కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు కనిపి స్తాయి. అందులో అటెండెన్స్ ఆప్షన్ ఎంపిక చేస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు. ఎవరెవరు ఎన్ని రోజులు చేశారనే వివరాలు కనిపిస్తాయి.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష



దీక్ష చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెం డింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడు దల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం మం చిర్యాలలోని ఐబీ చౌరస్తాలో ఫీజు దీక్ష చేపట్టారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, అభినవ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.8300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్‌లో ఉందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థు లకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, డబ్బులు చెల్లించి సర్టిఫి కెట్లు తెచ్చుకుంటున్నారన్నారు. దీక్షకు ప్రైవేటు కళాశాలల యజమానులు మద్దతు తెలిపారు. నాయకులు సతీష్, రాంచరణ్, ఆకాంక్షహరిప్రియ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

హాజీపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నంనూరు, గుడిపేట గ్రామాల్లో మంగళవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి శాంతిరేఖ తెలిపారు. 140 ఆవు జాతి, 356 గేదె జాతి పశువులకు టీకాలను వేశామన్నారు. సిబ్బంది అగ్నివేష్, నారాయణ, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దరఖాస్తులు అందజేత

మందమర్రిరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు దరఖాస్తు ఫారాలను మంగళవారం అందించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకోని గ్రాడ్యుయేట్లు నవంబర్ 6 వరకు నమోదు చేసుకోవచ్చని సూచించారు. రాంటెంకి దుర్గరాజ్, ముల్కల రాజేంద్ర ప్రసాద్, వీరస్వామి, ఆకారం రమేష్ తదితరులు పాల్గొన్నారు.





కు.ని.కి పాట్లు

జిల్లాలో కుటుంబ నియంత్రణ(కు.ని) ఆపరేషన్లు నిలిచిపోయాయి. రెండేళ్లుగా శిబిరాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో విధిలేక ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే చేయించుకోవల్సిన పరిస్థితి నెలకొంది. పేదలకు ఇది ఆర్థిక భారం గా మారుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తిరిగి శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నా ఉన్నతాధికారుల నుంచి కార్యాచరణ కరువైంది.

- నిలిచిపోయిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండేళ్లుగా బంద్
- విధిలేక ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు
- పేదలపై ఆర్థిక భారం..ప్రోత్సాహానికి దూరం

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనాభా కట్టడిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కీలకం. వీటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించే డీపీఎల్(డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్) శస్త్ర చికిత్సలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ క్యాంపులను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతినెలా నిర్వహించేవారు. రెండేళ్ల క్రితం ఆపరేషన్లలో అపశ్రుతి చోటుచేసుకుంది. నలుగురు మహిళలు మృతి చెందడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. అప్పటి నుంచి శిబిరాలను నిలిపి వేసింది. ఈ సంఘటన జరిగి రెండేళ్లు కావస్తున్నా తిరిగి ఆపరేషన్లు పునరుద్ధరించాలనే ఊసే ఎత్తడంలేదు. గత ప్రభుత్వం హయంలో నిలిచిపోయిన ఈ ఆపరేషన్లను ఇప్పటికైనా ప్రారంభిస్తారని మహిళలు ఎదురు చూస్తున్నారు.

● డీపీఎల్ క్యాంపుల వైపు..

మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఎక్కువగా డీపీఎల్ క్యాంపుల వైపే మొగ్గు చూపిస్తుంటారు. ఈ శిబిరాలు లేక పోవడంతో ఇప్పు డు రెండు, మూడు కాన్పు తర్వాత ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుం టున్నారు. ఈ ఆపరేషన్ చేయించుకుంటే వారం రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి ఉంటుంది. ఇవి కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో తక్కువగానే చేస్తున్నారు. దీంతో మహిళలు గత్యంతరం లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆసుపత్రుల స్థాయిని బట్టి రూ. 20వేల నుంచి రూ. 30వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసే డీపీఎల్ ఆపరేషన్లతో పైసా ఖర్చు లేకుండా కేవలం మూడు, నాలుగు గంటల వ్యవధిలోనే ఇంటికి పంపిస్తారు. అందుకే ఈ క్యాంపులు ఎప్పుడు పెట్టినా పెద్ద ఎత్తున మహిళలు ఆపరేషన్లు చేయించుకుంటుంటారు.

● క్యాంపుల నిలిపివేతతో..

ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నిర్వహణ క్యాంపులను గత కొంత కాలంగా నిలిపి వేయడంతో ఆపరేషన్ల కోసం ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించాల్సి వస్తుంది. డీపీఎల్ క్యాంపుల నిర్వహణ సమయంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆపరేషన్లు చేయించుకునేవారు. ప్రతి డివిజన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు రెండు సార్లు ఈ క్యాంపులను నిర్వహించేవారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతినెల నిర్వహించే శిబిరాల్లో 100 నుంచి 200 మంది వరకు ఆపరేషన్లు చేయించుకునేవారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్యాంపులకు బ్రేక్ పడినప్పటి నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో 2021-22లో 1730 ట్యూబెక్టమీ అపరేషన్లు జరుగగా, 2022-23లో 1606, 2023-24లో 1083 ఆపరేషన్లు జరిగినట్లు అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్రభుత్వం క్యాంపులను నిర్వహించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉండగా క్యాంపులను నిర్వహించక పోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెల కొన్నాయి. దీంతో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రభుత్వం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

వేసెక్టమీపై ప్రచారం చేసినా..

- తుకారాంభట్, జిల్లా వైద్యాధికారి



వేసెక్టమీపై ప్రచారం చేసినా పురుషులెవరు ముందుకు రావడంలేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుటుంబనియంత్రణ ఆపరేషన్లలో డీపీఎల్‌కు మహి ళల నుంచి స్పందన ఉండేది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఈ క్యాంపులు నిలిచిపోయాయి. ప్రభుత్వం అనుమతిస్తే చర్యలు తీసుకుంటాం.

సర్వేలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమైనది

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 6వ తేదీ నుంచి చేపట్టనున్న సమ గ్ర ఇంటింటి సర్వే కార్యక్రమంలో సూపర్‌వైజ ర్ల పాత్ర కీలకమైందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృ త కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ క్యాక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్‌డీవో లోకేశ్వర్ రావు, ముఖ్య ప్రణాళికాధికారి కోటయ్య నాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలలో సర్వే ప్రక్రియ కోసం 15 శాతం అదనంగా 1,400 మంది ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని చెప్పారు. ఇందు కోసం సిబ్బందిని గుర్తించి నియమించాలని తెలిపారు. నియమించిన ఎన్యుమరేటర్లకు మండల స్థాయిలో శిక్షణ పూర్తి చేయాలన్నారు. ప్రతీ ఎన్యుమరేటర్ ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలు సేకరించాలని తెలిపారు. నవంబరు 3వ తేదీలోగా ప్రతి ఇంటి యజమానుల జాబితా తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో 1,115 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించనున్నామని చెప్పారు. 2011 జనాభా గణనలో ఉపయోగించిన మ్యాపుల సహాయం తీసుకోవా లని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వే ప్రక్రియపై శిక్షణ అందించారు.

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర తహసిల్దార్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్షించగా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, కృష్ణరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మంత్రి మండలి నిర్ణయంతో రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతుందని చెప్పారు. ఈ ప్రక్రియలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించి వాటి అదారంగా అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రణాళికలు తయారు చేసి అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతుందన్నారు. ఇందు కోసం ఎన్యుమారేషన్ బ్లాకులను కేటాయించి ఒక బ్లాకు కింద 150 కుటుంబాలను కేటాయించి వివరాలు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నవంబరు 30లోగా నివేదికలను సమర్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్వో లోకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ఎంపిక

బెజ్జూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన మడావి మనోహర్, రాధ ఉపాధ్యాయ దంపతుల కుమార్తె స్నేహలత గోవాలో నిర్వహించే ప్రపంచ కప్ కరాటే చాంపియన్ షిప్ పోటీలో పాల్గొనే అవకాశం దక్కింది. హనుమకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న స్నేహలత గత ఆగస్టులో వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయిలో కరాటే పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. కరాటేలో ప్రతిభ కనబరిచిన స్నేహలత నవంబరు 7నుంచి 10వరకు గోవాలో నిర్వహించే వరల్డ్ కప్ కరాటేలో పాల్గొనే అవకాశం దక్కింది.

రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలలో ఎస్‌జీఎఫ్ అండర్-19 నెట్ బాల్ జోనల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఐఈఓ కళ్యాణి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

వాంకిడి, అక్టోబరు 29: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వాంకిడి, కెరమెరి మండల సమన్వయకర్త రఘువీర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్య శాలలో వైద్య సిబ్బందికి పిల్లల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్, హెచ్‌ఈవో రవిదాస్, క్రిస్టియానా పాల్గొన్నారు.

ఘనంగా ధమ్మ చక్ర పరివర్తన దినోత్సవం

ఆసిఫాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ బౌద్ధ దీక్షలు తీసుకున్న దినోత్సవాన్ని ధమ్మచక్ర పరివర్తన దినోత్సవంను మంగళవారం ఆసిఫాబాద్‌లోని లుంబిని దీక్ష భూమిలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, అశోక్, అనీల్, రవిదాస్, అతిష్, ప్రమోద్, సుధాకర్, అజిత్, భీంరావు, బాపురావు, టికానంద్, గౌతం, సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల ను వేటాడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. జిల్లాలోని సిర్పూర్(టి) లో జరిగిన సంఘటన నేపథ్యం లో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిర్పూర్ రేంజ్ పరిధిలో వన్యప్రాణులను వేటాడుతున్న ఎనిమిది మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడిగా దీపక్ ఠాకూర్ ఇంట్లో అడవి పంది మాంసంను గుర్తించినట్లు తెలిపారు. పంది తలను తన ఇంటి సమీప ప్రాంతంలో, కాళ్లను మరో చోట గుర్తించా మని వివరించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. సిర్పూర్ జడ్జి సమక్షంలో మంగళవారం హాజరు పరిచి ఏడుగురిని రిమాండ్‌కు పంపించామని తెలిపారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఎస్‌ఆర్పీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యా వికాసానికి ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఖచ్చితంగా పాఠశాల సమయానుసారం వెళ్లి విద్యనందించాలని అన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరిత గతిన పూర్తి చేయించాలని కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు సీఎల్ మంజూరు చేసేటప్పుడు ఆ పాఠశాల మూత పడకుండా చూసుకోవాలని, ఎస్‌సీఆర్పీ వ్యవస్థ గిరిజన సంక్షేమ శాఖ విద్యలో కీలక పాత్రని చెప్పారు. యూడైస్ ప్లాస్‌లో అందరు తమ సమాచారం నింపాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్ , తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ సేవలు అభినందనీయం

ఆసిఫాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అదనపు కలెక్టర్ దాసరి వేణు జిల్లా ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్నందున మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కెరమెరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై విజయ్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌రెడ్డి అధ్యాపకులు శ్రీనివాస్, స్వామి, కిశోర్, రాము, సుశీల్, సరళ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడాల్లో దండారి ఉత్సవాలు



ఆసిఫాబాద్‌లో గుస్సాడీ నృత్యాలు చేస్తున్న ఆదివాసీలు

ఆసిఫాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గోండు గుడాల్లో దండారీ ఉత్సవాలను ఆదివాసులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నారు. అడవి తల్లిని నమ్ముకుని తరతరాల తమ జీవన విధాన్ని కొనసాగిస్తూ గోండు గూడాల్లో దండారి సంబరాలను ఉత్సవంగా జరుపుకుంటున్నారు. గోండులకు ప్రత్యేకమైన గుస్సాడీ ఉత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. వారి వ్యవహారాలతో వింతైన సంస్కృతి సంప్రదాయాలతో పక్షం రోజుల పాటు సాగే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గోండుల సంప్రదాయ, ఆచారాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకం. కొండకోనలతో అల్లుకుపోయిన వారి బంధం ప్రకృతిని ప్రేమించే తత్వం. వారి ఆచార సంప్రదాయాల డోలు, డప్పు, కొమ్ము, చెట్టు, మట్టి ప్రకృతి సంబంధమైన వైవిధ్యమైన జీవన విధానం వారిది. దీపావళి పండగ సందర్భంగా మొదలయ్యే ఆదివాసీల సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకగా దండారి ఉత్సవాలు నిలుస్తాయి.రాష్ట్ర పభుత్వం దండారి ఉత్సవాలకు రూ.1.50 కోట్లు నిధుల మంజూరు చేసింది. ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి పరిధిలోని ప్రతి దండారికి రూ.15వేల చొప్పున 1000 గ్రామాలలోని దండారిలకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి.

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంకమరాజు ఆలయ ఆవరణలో మంగళవారం దండారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎత్మసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుస్సాడీలు, దండారి బృందాలు చేసిన నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, అలీబీన్ అహ్మద్, శ్రీనివాస్, వెంకటేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

దండారి సంబరాలు ప్రారంభం



నృత్యం చేస్తున్న ఆదివాసీలు

జైనూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జైనూరు ఏజెన్సీలోని పలు గ్రామాల్లో దండారి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని జామ్ని, పవర్‌గూడ, మార్లవాయి, గౌరి, రాసిమెట్ట, ధబోలి, జండాగూడ, మాన్కుగూడ, గూడామామడ, జంగాం, పొలాస రావుజీగూడ, లేండిగూడ, పట్నాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం దండారి సంబరాల సందడి నెలకొంది. ఆయా గ్రామాల ఆదివాసీలు దండారి దేవత ఏత్మసర్‌కు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పవర్‌గూ డకు ఆదిలాబాద్ జిల్లా నార్నూరు మండలంలోని ముక్తాపూర్‌కు చెందిన దండారిని గ్రామస్థులు సాదరంగా ఆహ్వానించారు. సదరు దండారి పవర్ గూడకు తరలి వచ్చి ఆటల పాటలతో అలరించారు. సాయంత్రం జామ్నికి చెందిన దండారి పవర్‌గూడకు తరలిరానుందని గ్రామస్థులు తెలిపారు.

పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్ట పరచాలి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ట పర చాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. రౌడీ హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ చాటిన సిబ్బంది ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఎండీ జాఫర్ సాదీక్, బి రాజ్‌కుమార్‌లకు పదోన్నతి చిహ్నాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు కరుణాకర్, రామనుజం, ఆర్‌ఐలు పెద్దన్న, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

ఆసిఫాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాంబట్ ముఖ్య అతిథిగా హాజరై ఆయుర్వేద ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్ప, డాక్టర్ వనిత, సిబ్బంది శంకర్, గౌతమి, రజిత, మల్లేశ్వరి, తార, మధురం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం భవనంలో జిల్లా నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు.

మధ్యాహ్నామే బడి బంద్



ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

పెంచికలపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం 4.30 వరకు కొనసాగుతాయి. కానీ మండలంలోని అటవీ ప్రాంత గ్రామం మురళీగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మంగళ వారం మధ్యాహ్నామే వెళ్లి పోయారు. దీంతో విద్యార్థులు కొద్ది సేపు వేచి చూశారు. ఉపాధ్యాయుడు ఎంతకు రాక పోవడంతో పిల్లలు ఇళ్లకు వెళ్లి పోయారు. ఈ విషయ మై ఎంఈవో రమేష్‌బాబును వివరణ కోరగా తాను మీటింగ్‌లో ఉన్నానని, ఈ విషయమే తెలియదని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా, ఆచరణలో మాత్రం అమలు కావడం లేని స్థానికులు చెబుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఈ పరిస్థితితో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

భీం స్ఫూర్తితో ముందుకు సాగాలి



భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కుమరం భీం స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలం లోని మోవాడ గ్రామంలో భీం వర్ధంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలో మంగళవారం కుమరం భీం వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో మల్లేష్ మాట్లాడుతూ భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

జీపీఎఫ్ రుణాలు విడుదల చేయాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ రుణాలు వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలోని మంగళవారం జూనియర్ అసిస్టెంట్ గిరిదర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు లోన్ పెట్టినప్పటికీ ఇంత వరకు విడుదల చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, రమేశ్, రవికుమార్, హరీష్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికకు 22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

లింగాపూర్, సిర్పూర్(యు), జైనూర్ మండల ప్రజలకు, శ్రేయోభిలాషులకు, అధికారులకు, నాయకులకు, బంధుమిత్రులకు దీపావళి శుభాకాంక్షలు.. మరియు 22వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి శుభాకాంక్షలు



పంచాయతీ రాజ్ అధికారులు
జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్

ఫరుఖ్ల్ హక్ ఖైఫీ, పంచాయతీ రాజ్ DE, జైనూర్

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి

అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు
మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.

పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు

మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్